# విజేత

> మనం- మన వృద్ధాప్యం గురించి ముందే ఆలోచిస్తే... జీవితంలో విజయం సాధించినట్టే !
>
> \- జయప్రద

"ఎన్నాళ్లకాంటీ !"

నాలుగేళ్ల కూతురు దీప్తికి చదువు చెప్పుకుంటున్న కీర్తి సంతోషంగా నాకెదురు వచ్చింది.

నా ఒంట్లోకి హఠాత్తుగా శక్తి వచ్చినట్లయింది. ఈ ఆప్యాయతకు ఎంతలా వాచిపోయున్నానో నేను!

"ఒక్క నిమిషం ఆంటీ! పాపకి అల్ఫబెట్స్ పలక మీద రాసిచ్చి వస్తాను..." అని కదలబోయిన కీర్తిని ఆపాను.

"ఫర్వాలేదమ్మా! నేనిక్కడే కూర్చుంటాను. నువ్వు చదువు చెప్పుకో!" నా నాలుక ఆ నాలుగు మాటలు ఉచ్చరించాక- నా మనసు మూడు పదుల సంవత్సరాల వెనక్కి వెళ్లింది.

తన కొడుకు రాంబాబుకి, ఇప్పుడు దీప్తికున్న వయసు కంటే ఒక సంవత్సరం ఎక్కువ ఉండేదప్పుడు. చదువు మీద అలవిగాని ఆశలున్న తనకు- చదువు చెప్పించలేదు నాన్న. తన బిడ్డైనా చదివి, పెద్ద పదవుల్లో కెళ్లాలనే గాఢమైన కోరికతో... తనకంటూ మరో జీవితం లేనట్టుగా చదివించింది.

"చూడూ దీప్తీ! నువ్వు క్లాస్ ఫస్ట్ వస్తే... నిన్ను నాన్నగారు 'గుడ్ గర్ల్' అంటారు. బాగా చదవాలి..."

నాలుగేళ్ల పసిదాన్ని ఎంత శ్రద్ధగా చదివిస్తోంది కీర్తి! ఎంత ఆకతాయి పిల్ల కీర్తి పెళ్లికి ముందు!

మరలా గత జ్ఞాపకాలు..!

తను మాత్రం తక్కువ శ్రద్ధ తీసుకుందా? "మహా చదువులు... ఎమ్మే, బియ్యేలు చదివినట్టు?!" అనే అత్తగారి సాధింపులు కూడా లెక్కచేయకుండా చదివించిందానాడు.

"దీప్తీ... గుడ్ గాళ్ కదూ! ఇవ్వన్నీ నాకు ఒక అరగంటలో వ్రాసి చూపించాలి. ఓ.కే!" అంటోంది కీర్తి- మరలా కూతుర్ని ఊరిస్తూ. "నీకు క్యాడ్‌బరీ చాక్‌లెట్ కొనిస్తాను... ఒక్క తప్పు కూడా వ్రాయకపోతే!" అని లంచం ఎర చూపిస్తోంది కీర్తి.

నవ్వుకున్నాను...

'ఎన్ని పొగడ్తలు? ఎన్ని లంచాలు? ఎన్ని త్యాగాలు? అయితేనేం... ఇప్పుడు తన కూతురు, కొడుకు ఎంత ఎత్తులో ఉన్నారు?! అమెరికా ఎంత దూరంగా వుందో తనకు తెలీదు కానీ, చాలా ఎత్తులో ఉందని మాత్రం తనకు తెలుసు. ఆ అయస్కాంతపు ఆకర్షణకు సమిధలైన ఎందరి తల్లితండ్రులను అమెరికా బలితీసుకుందో కూడా తనకు తెలుసు.

కీర్తి తన చిన్నారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలని, తాపత్రయపడుతున్న టైమ్‌లో తను వచ్చి కీర్తిని ఇబ్బందిలో పెట్టింది. దీప్తి స్కూలు నుండి రాకముందు తాను వచ్చివుండాల్సింది!' నా ఆలోచనలకు నాకే నవ్వు. వీళ్ళు చదివి మాతృమూర్తిని ఉద్ధరిస్తారా? మాతృభూమినా?

"ఆంటీ... మీకు కాఫీ తెస్తాను!" అంటున్న కీర్తి చెయ్యి పట్టుకున్నాను-

"వద్దమ్మా! ఇప్పుడే తాగి వచ్చాను. నీతో కాసేపు గడిపి పోదామని వచ్చాను. మరోసారి వస్తాను... పాపకు చదువు చెప్పుకో..." మనసు మొరాయిస్తున్నా- నా నాలుక సభ్యతను మర్చిపోలేదు.

"భలేవారాంటీ... మీరు రాక రాక వస్తేను!!" సోఫా కమ్ బెడ్‌లో ప్రక్కనే కూర్చుంటూ అంది కీర్తి. పాపం... ఆమె కూడా సభ్యతను పాటించాలి కదా!

"అన్నయ్య, అక్కయ్య ఫోన్స్ చేస్తున్నారా? బావున్నారా?" ఎక్కడకెళ్ళినా అడిగే ప్రశ్న... వద్దన్నా విన్పించే ప్రశ్న... విదిలించుకున్నా అల్లుకునే సత్యం.

"బాగున్నారమ్మా! ఉత్తరాలు, ఫోన్స్ వస్తున్నాయి..." అలవాటైన అసంకల్పిత జవాబు. అలవాటైన అబద్ధం!

"ఆంటీ... ఎప్పుడొచ్చారు?"

తల తిప్పి చూడడానికి మెడ నొప్పి. 'మనసు నొప్పి' ముందు ఈ మెడనొప్పి ఎంతనీ..? బలవంతంగా తల ప్రక్కకు త్రిప్పి చూశాను.

మరో పోర్షనులో ఉన్న రాధ లోపలికి అడుగు పెడ్తోంది. తనతో వచ్చిన ఓ మధ్యవయస్కురాలిని కూర్చోమని- తనూ కూర్చుంది రాధ.

"ఆంటీ... పిల్లలు బాగున్నారటనా? జాబు లొస్తున్నాయా? ఫోన్ ఎప్పుడొచ్చింది?"

అదే ప్రశ్న!

చెవుల్లోకి దూరి, టింపానిక్ మెంబ్రేన్‌ని ఛేదించుకుని, నా మనసు పొరల్లోకి వద్దన్నా దూరే ప్రశ్న!

"బాగున్నారు. తరచూ జాబులు వ్రాస్తుంటారు. నిన్ననే ఫోన్ వచ్చింది..." నా నాలుక చివరనుండి మనసు మొరాయిస్తున్నా వచ్చిన అలవాటైన జవాబు! గుండె స్పందించి చెప్పని జవాబు.

"టీవీలో యిప్పుడు ఘుమఘుమలు వస్తాయి కదూ కీర్తీ... ఆన్ చెయ్యి!" వీళ్ళ ధారాపాతం లాంటి ప్రశ్నలు వినే ఓపిక, జవాబిచ్చే శక్తి లేక టాపిక్ మార్చాను.

కానీ, తనకు ఎవరున్నారు? 'ఘుమఘుమ'లను చూసి, కొత్త వంటలు చేసి, నేర్చుకుని, ఎవరికి చేసిపెట్టాలి కనుక?! అమెరికాలో వున్న బిడ్డలకా? స్వర్గంలో ఉన్న భర్తకా?

"లేదాంటీ... పాప పెద్దదయింది కదా! టీవీ ఆన్ చేస్తే పుస్తకాలు వదిలేసి వచ్చేస్తోంది. అందుకే టీవీ అమ్మేశా!"

"మంచి పని చేశారు!" అన్నాను.

ఎంత కృత్రిమత్వం నాలో?! నిజం చెప్పాలంటే... 'పిచ్చిదానా! రేప్పొద్దున నీ బిడ్డకు రెక్కలొచ్చి ఎగిరిపోయాక- నీ ఎదిగే వయసు, నీ మనసు మీద నల్లటి తెర కప్పాక- నువ్వు టీవీ కొనుక్కున్నా... చూడాలని నీకు ఆసక్తి ఉండదు. అన్యాయం అయిపోతావు, పశ్చాత్తాప పడ్తావు. ముందే కళ్ళు తెరువు' అని చెప్పాలి.

"దీప్తి అదృష్టవంతురాలాంటీ! మా పైపోర్షన్ అమ్మాయి... కరుణ లేదూ- ఆ అమ్మాయి బిడ్డలిద్దరికీ ట్యూషన్ మాష్టారిని పెట్టేసి, హాయిగా టీవీ చూసుకుంటుంది. జీవితాన్ని 'ఎంజాయ్' చేస్తున్నానని అనుకుంటుంది. రేప్పొద్దున్న పిల్లల భవిష్యత్తు పాడైనప్పుడు కదా... తనేం పోగొట్టుకున్నదో తెలిసేది?!"

"ఆ అమ్మాయికి జీవిత సత్యం తెలుసులాగుంది!" అణచిపెడ్తున్న మనసు అబద్ధపు సభ్యతా ముసుగును తొలగించుకుని బయటపడింది. అలా బయటపడిన మనసును మరలా మందలించి మౌనంగానే నేను మిగిలిపోయినా... రాధ మాత్రం ఊర్కోలేదు.

"అదేవిటాంటీ... అలా అంటారు? పిల్లలు చదువుకుని పెద్దవాళ్ళయితే ఆ గర్వం మనది కాదూ? ఆ సంతోషం చాలదూ?"

"నిజమే..." అంది రాధ ప్రక్కనున్న పెద్దావిడ.

అప్పుడు స్పృహలోకొచ్చిన దానిలా ఆమెను మాకు పరిచయం చేసింది రాధ- "పిన్నీ! వీరు కీర్తిగారి ప్రక్క పోర్షన్‌లో ఉంటున్నారు!"

కళ్ళు చికిలించి చూశాను నేను. వాడిపోయాయనుకున్న నా జ్ఞాపకాల తెరవెనుక నుండి, ఓ పటిష్టమైన జ్ఞప్తి ప్రసవించింది. ఆమె... ఆమె... 'విజేత' కాదూ?! ఆ తెల్లటి ఛాయ, విశాలమైన కళ్ళు, నవ్వకపోయినా నవ్వినట్లుండే ఆ పెదాలు ఈనాడు వాడినా... ఆమె 'విజ్జీ' కాక ఇంకెవరు? "మీరు... మీరు... విజ్జీ కదూ!?" తటపటాయిస్తూ అన్నాను.

ఆమె కళ్ళు మెరిశాయి. ఆనాటిలా కాకపోయినా... ఇంకా విజ్జీ కళ్ళల్లో మెరుపు మాసిపోలేదు. ఎంత అందమైన కళ్ళవి?!

"నువ్వు... నువ్వు జగతివి కదూ..?"

నా ముకుళితమైన మనసు చాలారోజులకు వికసించింది.

"అవును! ఎన్నేళ్లయింది మనం కలుసుకుని?" స్వచ్ఛంగా ఆనందించాను.

"జగతీ! ఎంత అదృష్టం... ఈరోజు నేనిక్కడికి రావడం!"

నేను నిట్టూర్చాను. నిజమే! చాలాకాలం విజయ జాబులు వ్రాసింది. తను పిల్లల చదువు ధ్యాసలో పడి, సర్వం మరచిపోయింది.

"మీరెక్కడున్నారు జగతీ... ఇప్పుడు? ఎరౌండ్ టెన్ ఇయర్స్ బేక్ నేను నీకోసం మీ పాత అడ్రసులో ట్రై చేశాను. నువ్వు పిల్లల్ని చదివిస్తూ మెద్రాసులో ఉన్నావని చెప్పారు. నేను మద్రాసు వచ్చినప్పుడల్లా సెంట్రల్ స్టేషన్‌లో, మెరీనా బీచ్‌లో, రెస్టారెంట్స్‌లోనూ ఎక్కడైనా కన్పిస్తావేమోనని పిచ్చిగా వెతికేదాన్ని!"

నేను వెనక్కెళ్లాను. నలభై ఏళ్ల వెనక్కెళ్లాను.

ఇంటర్మీడియెట్ అయిపోగానే... ఏదో మునిగిపోయినట్లు పెళ్ళి చేసుకోవడం, అంత అర్జంటుగానే పిల్లల్ని కనేయడం. ఆ తర్వాత వాళ్ళే లోకం! వాళ్ళే సర్వం!!

ఐదేళ్లు వన్ వే ట్రాఫిక్‌లా... విజ్జీ దగ్గర నుండి లెటర్లు! ఆ తరువాత ఒకరోజు విజ్జీ పెళ్ళి కార్డు! కాస్త సంతోషం... వెళ్లి చూస్తే బాగుణ్ణనే ఆరాటం... తీరా– ఆ టైమ్‌లో పెద్దాడి అప్పర్ కేజీ ఎగ్జామ్స్... నాలుగేళ్ల వాడిని అప్పుడే డాక్టర్ని చేయాలనే తపన!

ఒకే మంచంలో పడుకుని, ఒకే కంచంలో తిన్న విజ్జీ– నా ఊహాపథంలో 'స్మృతి'గా మాత్రమే మిగిలిపోయింది. ఆరోజు కట్టిన తెరను ఈరోజు తొలగించాను. ఎంత మైకంలో గడిపానిన్నాళ్లు!?

"నా పిచ్చిగానీ... మనం విడిపోయి నలభై వసంతాలు! కన్పిస్తే నిన్ను గుర్తుపట్ట గలిగేదాన్నే కాదు!"

విజ్జీ తనని పోల్చుకోలేకపోయేదాన్నని ఫీల్ అవుతోంది గానీ– తను ఒకవేళ ఆరోజుల్లో విజ్జీని గుర్తుపట్టినా... తను తన బాల్య స్నేహితురాలికి ఇంపార్టెన్స్ ఇచ్చేదా? సేవితని డాక్టర్ని, కిరణ్‌ని ఇంజనీర్‌ని, బాలుని ఆడిటర్‌నీ చేయాలనే గాఢమైన పట్టుదలతో భర్తను కూడా నెగ్లెక్ట్ చేసిన తనకు– విజ్జీతో నిర్మలంగా, సస్నేహంగా నాలుగు మాటలు మాట్లాడే 'తీరిక' ఉండేదా?

అసలు తీరికెక్కడిది తనకి? తప్పిదారి తీరిక దొరికితే... తన పిల్లల్ని నాలుగడుగుల నీళ్లున్న చెరువులో తోసి, ఈత నేర్చుకోమనేది. నిద్రలో కూడా వాళ్ళను వదిలింది కాదు. డొక్కలో పెట్టుకుని, నిశ్చింతగా నిద్రపోయేది. పదేళ్ల కాపురంలో తను తన భర్తను సుఖపెట్టింది చాలా తక్కువ. ఇప్పుడాయన లేడని... చింతించి ఏం ప్రయోజనం?

"జగతీ... ఏమిటలా అయిపోయావు?"

"ఏమీ లేదు. మన కాలేజీ రోజుల్ని గుర్తుచేసుకుంటున్నాను..." సర్దుకుంటూ అన్నాను.

"జగతీ! నీ దగ్గర్నుండి ఉత్తరాలు వస్తాయని చాలారోజులు ఎదురుచూశాను..." అప్పుడు ఉత్తరాలు అందుకోని విచారం, ఇప్పుడు స్నేహితురాల్ని కలిసిన ఆనందం... రెండూ ఆమె కంఠంలో ఏకకాలంలో ప్రకంపించాయి.

"విజ్జీ! నీకు నేను రెండు మూడు ఉత్తరాలు వ్రాశాను..."

అబద్ధం చెప్పాను! పచ్చి అబద్ధం!!

– ఐదు పైసల కార్డుముక్కను, ఐదు నిమిషాల కాలాన్ని కూడా తను తన ఆప్తమిత్రురాలి కోసం కేటాయించలేదు.

'నేను నీకు ఉత్తరాలు వ్రాయకపోయినా– నువ్వు నా జ్ఞాపకాలలో సజీవంగా ఉన్నావు!' అని చెప్పమని నా మేధస్సు తొందరపెట్టినా... నా మనసు మాత్రం అంగీకరించలేదు.

తన పిల్లల దగ్గరనుండి చిన్న ఎదురుదెబ్బలా తను తింది? తన మనసు ఒప్పుకోవద్దూ... ఇంకా స్వచ్ఛంగా ప్రేమిస్తున్న స్నేహితురాల్ని వంచించడానికి?

"సారీ విజ్జీ!" గిల్టీగా అన్నాను.

"పోనీలే! ఉత్తరాలు వ్రాస్తేనేనా ప్రేమ? చూడూ..: చప్పున నువ్వే నన్ను గుర్తుపట్టేశావు. నా ముద్దుబుజ్జి నిన్ను గుర్తుపట్టిందా?"

మనం తప్పు చేసినప్పుడు ఎదుటివ్యక్తి కోపగించుకోకుండా 'క్షమించటం' అనేది మనసున్న వాళ్ళకు అదొక పెద్ద శిక్ష! నాలో పశ్చాత్తాపం నన్ను దహిస్తూ, నా అంతరాంతరాల్లో ఇంకా మిగిలిన కాలుష్యాన్ని కడిగేస్తూ, నా మనసును ప్రక్షాళనం చేసింది.

నేను నా స్నేహితురాలి చేయి పట్టుకున్నాను.

"కీర్తీ! చాలా చాలా కాలానికి కలుసుకున్న విజ్జీని మా ఇంటికి తీసుకెళ్తున్నాను. మరోసారి నీ దగ్గరకొస్తానమ్మా!" అని చెప్పి వేగంగా కదిలాను. నా కాళ్లలోకి అంత శక్తి ఎలా వచ్చిందో!

"మమ్మీ! మీరు పినాకినికి వెళ్లాలన్నారు?" అంది రాధ.

"సో డియర్... కాన్సిల్ ఇట్! మేక్ తత్కాల్ అరేంజ్‌మెంట్ ఇన్ నెక్ట్స్ ట్రెయిన్... రాత్రికే! ఒకే?!" నా వెనుకనే పరుగెట్టింది విజ్జీ.

అప్పుడూ, ఇప్పుడూ ఆమె ప్రేమను ఎంత కించపర్చింది తను? ఇంటికి తీసుకొచ్చిన స్నేహితురాలికి టీ ఇవ్వాలనే ఫార్మాలిటీని నేను పాటించలేదు. నా మనసు పొరల్లో సమాధి చేసుకుని, సురక్షితంగా అణచబడిన వాస్తవాల్ని– దేవుడి ముందు పుష్పాల్ని రాల్చిన భక్తురాలిలా, ఆమె స్నేహం ముందు పాదరసంలా పరిచాను...

"నా పిల్లల ఎదుగుదల కోసం, నాదైన సుఖశాంతుల్ని త్యాగం చేశాను. ప్రతి పైసా వాళ్ళకోసమే ఖర్చుపెట్టి, నా మనసును అసంతృప్తికి లోను చేశాను. నేను ప్రేమించినంతగా వాళ్ళు నన్ను ప్రేమించరనే సత్యం తెలిసీ వాళ్ళను ప్రేమించాను. ఇంతెందుకు– డాక్టర్లు నీ ప్రాణం ఇస్తే గానీ, నీ బిడ్డ ప్రాణం కాపాడలేమని అడిగుంటే... సంతోషంగా ఇచ్చుండేదాన్ని!"

"కానీ, జగతీ..!"

నేను సుదీర్ఘంగా చెప్పున్నదంతా ఓపిగ్గా, దీక్షగా వింటున్న విజేత ఏదో చెప్ప బోయింది.

కానీ, నేనామెను వారించాను –

"నన్ను చెప్పనీ విజ్జీ! నేను కోరుకున్నది కేవలం- వాళ్ళు ఏ చెడుగుణాలు లేకుండా, మంచిపేరు తెచ్చుకోవాలనీ, వాళ్ళ నీడలో నా జీవితం కడదాకా గడిస్తే చాలని..." నా కంఠంలో కన్నీళ్లు.

చిత్రం... విజ్జీ కళ్ళల్లో తడి!

నలభై ఏళ్ల సుదీర్ఘమైన కాలం... ఆ దూరం కూడా ఆమె గుండెల్లో నాపట్ల వున్న స్నేహభావాన్ని తుడిచేయలేకపోయిందన్న మాట!

ఎంత నిర్దయురాలు తను?

నా ఎండిపోయిన చెంపల మీదుగా కారిన కన్నీటిని తుడవబోయిన విజ్జీ చేతిని అందుకుని, చప్పున ముద్దుపెట్టుకున్నాను. నా కన్నీటికుండ బ్రద్దలైంది... మరుక్షణంలో నేను ఆమె ఒడిలో ఉన్నాను.

ఈ క్షణం ఎంత బలహీనమైందో! ఒక్కొక్కటి- ఒక్కొక్కటి... నా మనసు పొరల్లో తాళం వేసివుంచిన రహస్యాలన్నీ ధారాపాతంగా, నా మనసును దాటుకుంటూ, నా పెదాల మధ్య నుండి దుమికేశాయి.

నా పెద్దకొడుకు తన కోర్కె ప్రకారం డాక్టరైనా, తనకు తాగనని యిచ్చిన ప్రమాణాన్ని దాటేసి, ఆ మత్తులో తూగుతూ... పేషెంట్స్‌నీ, తల్లినీ కూడా నిర్లక్ష్యం చేస్తున్న వైఖరిని... ఇంజనీర్‌ని పెళ్ళిచేసుకుని కెనడా వెళ్లిపోయి, తిరిగి మరిగిచూడని కూతురు గురించి... బి.టెక్. చేసేవరకూ తన ఒళ్ళో పెరిగి, "రెండేళ్లలో వస్తాను మమ్మీ!" అని మురిపించి, మరిపించి, మాయ చేసి, స్టేట్స్ వెళ్లి ఓ డాక్టరమ్మాయిని పెళ్ళి చేసుకుని, అక్కడే సెటిల్ అయిన చిన్నకొడుకు సంగతి... ఏదీ దాచలేదు నేను.

నా తల నిమురుతూ నిశ్శబ్దంగా వింటున్న విజ్జీ నోరు విప్పింది -

"నువ్వు తప్పు చేశావు జగతీ..!"

"నేను వాళ్ళని చదివించాల్సింది కాదా?"

తల అడ్డంగా ఊపింది విజేత.

"నీ అనాలిసిస్ రాంగ్! పిల్లల్ని చదివించి, ప్రయోజకుల్ని చేయడమన్నది కన్నందుకు అది మన బాధ్యత. నువ్వు నీ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించావు. వాళ్ళు ప్రయోజకులయ్యారనే నిజం చాలు... నువ్వు సంతోషంగా, గర్వంగా బ్రతికేయడానికి!"

"మరి, నా సంగతేమిటి?" విజేత వైపు రోషంగా చూస్తూ అన్నాను.

"అదే... అదే... నువ్వు తప్పు చేశావన్నది నేను. నీకంటూ నీకొక జీవితాన్ని ఏర్పరచుకోకుండా వాళ్ళతోనే నీ జీవితమనుకున్నావు. వాళ్ళకు రెక్కలొచ్చి ఎగిరిపోవడమన్నది ఈ సృష్టిలో పునరావృతమౌతున్న సహజమైన సంగతి. ఈ సత్యాన్ని నువ్వు జీర్ణించుకోవడానికి, నిరాకరిస్తున్నావు. అందువల్లే నీ జీవితం చప్పగా ఉంది."

"నువ్వు వాళ్ళని సమర్థిస్తున్నావు!" నాలో అసహాయత్వం, నన్ను స్నేహితురాలు సమర్థించడం లేదనే ఉడుకుమోత్తనం!

"నో... జగతీ! నేను వాళ్ళను సమర్థించడం లేదు. వాళ్ళను అర్థంచేసుకోమంటున్నాను. నీదే కాదు... చాలామంది జీవితాల ముగింపు ఇలాగే ఉందని చెబ్తున్నాను."

నా మనస్సు మరలా ముడుచుకుంటూంది. విశృతమైన జ్ఞానంతో స్నేహితురాలు చెబ్తున్నది నేను అర్థంచేసుకోలేకపోయాను.

నా మనసులో మాట తెలిసిపోయినట్టుంది విజేతకు. మరలా తనే అంది -

"నిన్ను ఓదార్చే మాటలు నా దగ్గర చాలా వున్నాయి. అవి నిన్ను సమర్థిస్తూ ఊరటపరుస్తాయి. కానీ, దీనివల్ల సొల్వేషన్ ఏమిటి? అందుకే... నువ్వు మారాలి. నీ ఆలోచనా ధోరణి మారాలి. నీ మనసు నీ పిల్లల మీద నుండి, వాళ్ళు నీకు చేసిన... నీవనుకుంటున్న నమ్మకద్రోహం నుండి మరో మూలకు మళ్ళాలి. నువ్వు మరో లోకం సృష్టించుకోవాలి. నువ్వు సుఖపడాలి జగతీ..."

నేను తెల్లబోయి వింటున్నాను. తన కెప్పుడైనా 'ఇలాంటి' ఆలోచన వచ్చిందా? ఎందుకు రాలేదు?

"జగతీ! మనం వేల సంవత్సరాలు బ్రతకడం లేదు. అప్పుడే మనకు మూడువంతుల జీవితం అయిపోయింది. ఇంకో వంతు ఉంది. అదీ... అనారోగ్యంతో. శారీరక అనారోగ్యం ఈ వయసులో సహజం... దానికి మనం మానసిక అనారోగ్యాన్ని తోడు చేయకూడదు.

వదిలేసి వెళ్లిన బిడ్డల కోసం మన సంతోషాన్నెందుకు మనం వృధా చేసుకోవాలి? నువ్వు సుఖపడు... నీ చుట్టూ నీకు అందుబాటులో ఉన్న ప్రపంచంతో కలిసిపో! నీ బిడ్డలు నీ దగ్గరకు వచ్చిన నాడు- వాళ్ళను నీ ప్రపంచంలోకి తీసుకో... వాళ్ళకి నీ ప్రేమనివ్వు. అప్పుడు నువ్వు ఇంతకాలం వాళ్ళ దగ్గరనుండి ఏది పొందలేదనుకున్నావో... ఆ ప్రేమను వాళ్ళ దగ్గరనుండి పొందగలుగుతావు."

ఈ సూక్ష్మసత్యం నాకర్థం కాలేదు. నాకు అర్థంకాలేదని జగతికి అర్థమైనట్టుంది-

"చూడూ! మనకు మన పిల్లల మీదున్న గాఢమైన ప్రేమతో, వాళ్ళు మన స్వంతమనే భావంతో... వాళ్ళ దగ్గరనుండి మనం ప్రేమను అందుకునే హక్కు మన కుందనుకుంటాం... కానీ- వాళ్ళ ప్రపంచం వేరు. అది అర్థంచేసుకుని, మన బాధ్యతలు మాత్రమే నిర్వర్తించా మనుకుని, హక్కులకై ఆరాటపడడం మానేయాలి."

క్షణంలో నాకూ జీవితం ఉందనే నిజం- నాకు కొన్ని మెగాలీటర్ల బలాన్ని ఇచ్చింది.

"ఇది ఒకవైపు నుండి నేను ఇచ్చిన సొల్వేషన్. అయితే, అటువైపు నుండి ఈ సమాజం మరో పరిష్కారం యివ్వాలి. భార్యాబిడ్డలతోపాటు తల్లిదండ్రుల్నీ పిల్లలు బాగా చూసుకునేలా చేయాలి. ఓ.కే. జగతీ... మరి, నేను వస్తాను. ట్రెయిన్‌కి టైమయింది. ఇదిగో... నా విజిటింగ్ కార్డ్! ఫోన్ చేసి... నీ ఫోన్ నంబరివ్వు!"

"స్టేషన్‌కి నేనూ వస్తాను..." అంటూ కార్డుని భద్రంగా అందుకున్నాను. చాలా పదిలంగా దాచుకున్నాను. చాలాకాలం తర్వాత కప్‌బోర్డు తెరిచి మూలన పడివున్న పాటూరు చీర తీసి కట్టుకున్నాను.

కొత్త ఉత్సాహంతో తీరిగ్గా అలంకరించుకున్నాను. మనసు గంతులేస్తుండగా... స్టేషన్ కెళ్లాను. ఇవ్వన్నీ చేస్తూ... నాకు పూర్తిగా అర్థంకాని విజేత అనాలిసిస్‌ని అర్థంచేసుకోవాలని ప్రయత్నిస్తున్నాను.

●

స్టేషన్లో 'యస్' కంపార్టుమెంట్ గేట్‌లో విజేత! ప్లాట్‌ఫారం మీద నేను, రాధ.

"ఇంతకీ... నా భావం నీకర్థమైందా?" అని పసిపిల్లలా నవ్వింది విజేత.

"ఊహూం... అదెలా? బలవంతంగా తల్లితండ్రుల్ని ప్రేమింపజేయడం ఎలా?"

రాడ్ పట్టుకుని ముందుకు వంగింది విజేత– "ఇది తొలి వార్! 'నీ భార్యను వదిలేశావా?' అని నిలదీసినట్టే– 'నీ తల్లిని, తండ్రిని గాలికి వదిలేశావా?' అని నిలదీస్తూ వస్తే... కొన్నేళ్లకు... 'నాకు జన్మనిచ్చిన పేరెంట్స్ కూడా... నావాళ్ళే!' అన్న తీయటి సహజ భావాన్ని జీర్ణించుకుంటారు. మొదట మొదట సమాజం పెట్టిన ఆంక్షల పట్ల విసుగు కలిగినా... కొన్ని సంవత్సరాలకైనా రాబోయే తరాల వారికైనా... వారి మనసుల్లో 'వీళ్ళూ నా వాళ్ళే!' అనే భావన బలమౌతుంది కదా... అర్థమైందా?"

అర్థమైందన్నట్టు తలూపాను... వృద్ధాప్యంలో భద్రతా భావాన్నీ, ఆ తృప్తినీ ఊహిస్తూ.

రైలు కదిలింది!

దానితో పాటు తన మనసును జయించిన విజేత కూడా... నాలో కొత్త ఆశల్ని నింపి, కొత్త ఉత్సాహాన్ని సృష్టించి, కనుమరుగైంది.

కానీ, నా మనోఫలకంపై మాత్రం ఆమె సలహా ప్రింట్ అయిపోయింది.

●

'నేటి నిజం' దినపత్రిక ... 12 సెప్టెంబర్' 2003 సంచిక 'సాహితీ కెరటాలు' శీర్షికలో ప్రచురితమైన కథ